# గతిమొక్క

—ఎ. వి. సీతారామమూర్తి

ఆ దానిమ్మ చెట్టు కృష్ణుడు నాటిందే. తిన్నవన్ని తినగా, చిలకలు కొట్టినవన్ని కొట్టగా ఇంకా చెట్టుకు గుత్తులు గుత్తులు కాయలు మిగిలి పోతున్నాయి.

వెదురుపందిరి నిండా అల్లుకుని, ఇంకా అలా డాబామీదికి పాకిపోయిన సన్నజాజికూడా కృష్ణుడు చేతిమీదుగా ప్రాణం పోసుకు పెరిగినదే.

కాలేజీలూ, క్లబ్బులూ, ఆఫీసులూ, సినీమాలూ— ఇంట్లోవాళ్ల కెక్కడి దంత శ్రద్ధ?

ఏమైనా కృష్ణుడు ఈ కాలపు పిల్లవాడు కాదు. ఇంట్లో నజరుగా కనిపించే ప్రతి వస్తువూ కృష్ణుడి చేత సేవలు చేయించుకున్నదే!

కృష్ణుడి గూర్చి తలుచుకుంటేనే ఎన్నో జ్ఞాపకాలు తల లెత్తుతాయి. అందులో కొన్ని సంతోషపరిచేవి. కొన్ని సానుభూతిని తెల్పేవి!

"ఎవ రొచ్చారో చూడు." ఆయన మాటలకు ఏదో పనిచేసుకుంటున్నదల్లా తల ఎత్తి చూసింది.


గుమ్మంలో నిలబడి ఉన్నా డో అబ్బాయి. వాడికి పదేళ్లుంటాయి. చామన ఛాయగా, ఆర్భకంగా ఉన్నాడు. రెండు కళ్లలో మా అమాయకత, భయం నను పాళ్లలో నిలిచాయా అనిపించింది.

"వీడా! వీడు చేయగలడా?"

"ఏం? ఎంచక్కా చేస్తాడు. డబ్బు లేదా? చదువూ సంధ్యా లేకుండా బడితిలా తిరుగుతున్నాడని వీళ్ల నాన్న నా కప్ప జెప్పాడు." ఆ మాట అనేసి వీధిగుమ్మం లోకి వెళ్లి వాలుకుర్చీలో కూర్చున్నా రాయన.

"నీ పేరేమిట్రా, బాబూ? ఇలా రా లోపలికి."

అప్పుడుగాని గుమ్మంలోకి అడుగు పెట్టలేదు వాడు.




"కృష్ణుడండి."

"మంచి పేరే! చూడు, కృష్ణా, మా ఇంట్లో పనిచేయటం నీ కిష్ట మేనా?"

కృష్ణుడు మౌనంగా తల వంచు కున్నాడు.

"నీ కిష్టం లేకపోతే బలవంతం లేదు."

ఆమాటకు వాడు ఆశ్చర్యంగా తల ఎత్తి చూశాడు.

కల్మషం లేని వాడి కళ్లలో నీళ్లు తిరగటం గమనించింది ఆమె. ఆ క్షణంలో వాడిపై అమితమైన జాలి, అభిమానం కలిగాయి.

కృష్ణుణ్ణి దగ్గరగా కూర్చో పెట్టు కుని నెమ్మదిగా అడిగింది కారణాన్ని.

# విల్లివాకం తెలుగు గ్రంథాలయ వార్షికోత్సవం

వినోదాత్మకమైన కార్యక్రమాలు నిర్వహించడం, సాంస్కృతిక సంస్థలను స్థాపించి నలుగురి మెప్పు, ఆదరణ పొందడం సులువేమో కాని, పూర్తిగా విజ్ఞానపరమైన కార్యక్రమాలతో సంస్థలను నిర్వహించడం చాలా శ్రమతోకూడిన పని—విజ్ఞాన దేవాలయాలుగా పేర్కొనదగిన గ్రంథాలయాలను స్థాపించి చక్కగా నిర్వహించి మెప్పుకు రావడం విశేషమే.

మద్రాసు విల్లివాకం తెలుగు పఠన మందిర దశమ వార్షికోత్సవం కళాసాగర్ అధ్యక్షుడు శ్రీ సి. ముద్దుకృష్ణారెడ్డి అధ్యక్షతన ఇటీవల సయానీ థియేటర్‌లో జరిగింది. కార్యదర్శి శ్రీ వై. ఉమామహేశ్వరరావు నివేదిక సమర్పించారు.

ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి రామలక్ష్మీ ఆరుద్ర ప్రవాసాంధ్రులకు ఇటువంటి సంస్థలు ఎంతైనా అవసరమన్నారు. గ్రంథాలయానికి తమ తరఫున కొన్ని గ్రంథాలను బహూకరించారు.

ప్రసిద్ధ నాటక రచయిత శ్రీ ఎన్. ఆర్. నంది ఈ రోజులలో ఒక పఠన మందిరం పదవ వార్షికోత్సవం జరుపుకోవడం గొప్ప విషయమన్నారు.

ఉపాధ్యక్షుడు శ్రీ జె. వి. చలపతిరావు కృతజ్ఞతలు తెలిపారు.

'సుడిగుండాలు' సినిమా ప్రదర్శనంతో కార్యక్రమం ముగిసింది. *

---

"ఏం లేదమ్మగారూ! మీ దగ్గర పని చేయడం నా కిష్టమే." కళ్ళు తుడుచుకున్నాడు.

అంతకుమించేం ప్రశ్నించ దలుచుకోలేదు. ఆ సందర్భంలో కృష్ణుడి ప్రవర్తన వింతగా తోచింది.

"రేపట్నుంచీ పూర్తిగా ఇక్కడే ఉండిపోవాలి— తెలిసిందా? పొద్దున్నే మీ నాన్నతో చెప్పి వచ్చేయ్."

మౌనంగా తల ఊపాడు.

ఆ రాత్రి—

పదకొండు దాటినా కంటికి నిద్ర లేదు. మనసంతా కలవరం. కాసులు చచ్చిపోయింది. ఎప్పట్నించో అది ఇంటిని కనిపెట్టుకుని ఉండేది. వయసు దాటింది. ఆయుష్షు తీరింది. పోయింది. మళ్లీ అటువంటి నమ్మకస్తురాలైన పనిమనిషి ఆమెకు తారస పడలేదు.

పిల్లలు పెద్దవారై ఫాషన్లు నేర్చిన కొద్దీ ఇంట్లో పని పెరిగిపోయింది.

'ఆయన వెర్రిగానీ, ఇంతెడు పనీ ఈ కుర్రకుంక చేయగలడా?' అమాయకంగా, బాధగా పనికి ఒప్పుకున్న వాడిని చూస్తుంటే అదోలా అనిపించింది ఆమెకు.

చిన్న వయసులోనే వాడికి 'ఇలా జీవించాలి' అనే నిర్బంధం!

తనెందు కిలా అయిపోయింది వాడిని చూసిన దగ్గరనుండీ? అవును, నెలకు పదిహేను ఇస్తున్నప్పుడు ఎవరైతే తన కేం? తనకు కావలసింది పని. వాళ్ళకి కావలిసింది డబ్బు. ఎంతమంది పనివాళ్లను చూడలేదు తను?

కానీ, కృష్ణుడు. . .

ఆ మర్నాడు తెల్లారకముందే తలుపు చప్పుడైంది.

ఎదురుగా వాడు— కృష్ణుడు.

"ఇంత తొందరగా వచ్చేశావేరా?"

"ఈవేళనుండే రమ్మన్నారుగా— అయినా, తొందరగా లేవడం నా కలవాటే!"

ఎంత మంచి అలవాట్లు వాడివి!

ఎనిమిదవందే లేవడు వాసు. ఆడపిల్లయినా వసంతకూడా అంతే. రేపే పని చెయ్యాలీ అంటే మరో పది సార్లన్నా అరవాలి వాళ్ల వెనక, అది జరిగే వరకూ.

"చూడు, కృష్ణా, నువ్వు కాఫీ తాగుతావా?"

"వద్దండమ్మగోరూ!"

"ఇదిగో, అదేం కుదరదు నాతో. ఈ రోజునుంచీ మాతో పాటే నువ్వూ. మేం ఏం తింటే, ఏం తాగితే నువ్వూ అదే. వద్దనకూడదు— సరేనా?"

అంగీకారంగా తల ఊపాడు కృష్ణుడు.

రోజూ తనతోపాటే వాడూ లేవడం, పాచిగదు లూడ్చి నీళ్లు పట్టడం, తనతో పాటే చీకట్నే వాడికీ కాఫీ.

"అమ్మకి కృష్ణుడంటే ఇష్టం. అందరికంటే ముందు కాఫీ ఇస్తుంది." రామిగాడికి ఉక్రోషం.

"నువ్వూ లేవరాదూ— నీకూ ఇస్తాగా?"

ఆ దెబ్బతో వాడి నోరు మూస్తుంది.

సంధ్య వాలింది. వీధి దీపాలు వెలిగాయి. పిట్టగోడమీదా, దాని కానుకున్న అరుగుమీదా వెలుతురు పలచగా పడింది. ఆదే అరుగు— ఆ అరుగుమీదే కూర్చుని సాయంకాలాలు కృష్ణుడు, పక్కింటి సుబ్బిగాడు కబుర్లు చెప్పుకునే వారు.

ఒక రోజు కృష్ణుడొక్కడే ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఏరా, కృష్ణా, సుబ్బిగాడేడీ? ఎటూ వెళ్లలేదా?"

ఉలిక్కిపడి కళ్లు తుడుచుకున్నాడు వాడు.

ఆశ్చర్యపోయింది ఆమె.

"ఏడుస్తున్నావా? ఛ! ఎందుకూ?"

సుబ్బిగాణ్ణి వాళ్ల నాన్న పనిలోంచి మానిపించి బడిలో చేర్పించాడట.,

"నాకూ చదువుకోవాలని ఉందమ్మగోరూ!" వాడినోటినించి ఆ మాట వస్తుందని ఊహించలేకపోయింది ఆమె.

ఆ మర్నాడు వాసుతో చెబితే—

"నీ వెర్రిగానీ వాడికి చదువెందుకమ్మా! అడ్డమైన వాళ్ళూ వృత్తులు వదిలేసుకుని చదువుకోబట్టే ఉద్యోగాలు కరువై పోతున్నాయి" అన్నాడు.

కృష్ణుడు వింటే ఎంత బాధ పడతాడు! నిజానికి ఆమెకే బాధనిపించింది.

'వాడికి చదువు ఉద్యోగం కోసం కాదురా. నీకు సినిమా చూడ్డం, క్లబ్బుకెళ్లడం ఎంత కోరికో వాడికి చదువంటే అంత— నీలా వాడికి ఆశల్లేవు.'

ఆ మాటలు ఆమె పెదవి దాటి రాలేదు— అటువంటి వాళ్లతో వాదించే శక్తి ఆమెకు లేదు!

"ఏమండీ! మన కృష్ణుడికి చదువుకోవాలని ఉందిట. ఇది చెప్పడానికి ఎంత సిగ్గుపడిపోయాడో! చంటివెధవ పోనీ . . ." తన మాటింకా బయటికే రాలేదు.

"ఇంకేం? బాగుపడుతున్నా డన్న మాట! అయినా, ఈ ఇంటిగాలి తగిలితేనే చదువబ్బుతుందే — ఓ ప్రైవేటు కుదుర్చుకోమను. దానికి పోగా మిగతా డబ్బే ఇస్తామని వాళ్ల నాన్నతో చెపుతాను."

ఆయనకూడా అలా అనటం ఆమె కేం నచ్చలేదు. ఇంతమంది ఇన్ని రకాలుగా జల్సాలు చెయ్యగా లేనిది, కృష్ణుడి భవిష్యత్తు కోసం, వాడి అల్పమైన కోర్కె తీర్చటం కోసం ఓ అయిదు ఖర్చుపెట్టలేకపోవడం తలవంపనిపించింది.

'నీ డబ్బుతో నువ్వు చదువుకోరా— అని చెప్పడమా! ఛ!'

రామిగాడి తరవాత మరి పిల్లలు కలగలేదు కానీ, లేకుంటే వాళ్లకీ చదువు చెప్పించే బాధ్యత తనపై ఉండేది కాదూ?

కృష్ణుడు తనని చదివించమని కోరలేదు. ఓదార్పువల్ల కలిగిన దుఃఖంతో మనసులోని మాట బయటి కనేశాడు.

ఒకవేళ చదివిస్తానన్నా ఒప్పుకునే వాడు కాదు. ఆ వయసుకు చిన్నయినా, అభిమానం గల మనిషి కృష్ణుడు—

( తరువాయి 43 వ పేజీలో )

# గాలిమొక్క

(39వ పేజీ తరువాయి)

అందుకే ఇంట్లో అందరికంటే వాడంటే ఆమె కిష్టం.

రోజులు గడుస్తున్నాయి.

ఇంట్లో కృష్ణుడికి పని బాగా పెరిగి పోయింది.

అందరి పనులూ వాడే చెయ్యాలి. ఎవరికే అవసరమొచ్చినా కృష్ణుడే గతి!

"కృష్ణా! కాఫీ" లేస్తూనే అడుగుతాడు వాసు.

"బాత్‌రూమ్‌లో నీళ్ళు పెట్టరా, కృష్ణా. స్నానం చేసి తొరగా కాలేజీ కెళ్ళాలి." పురమాయిస్తుంది వసంత.

"నే భోజనం చేసి వచ్చే లోపల ఆ వల్ల బూటుకు పాలిష్ చెయ్యాలి. అద్దంలా ఉండాలి — తెలిసిందా?" రామిగాడూ నేర్చాడు.

"ఒరి కిష్టిగా! మొక్కలకీ, పాదులకీ నీళ్ళు పొయ్యడంతో సరిపోలేదు. గొప్పులు తవ్వి కాలవలు కట్టాలి— తెలిసిందా? రేపొ పని చూడు. ఊర్లొ తిరుగుతావ్— నాలుగు మంచి విత్తనాలు సంపాదించి పాదులు పెట్టరాదూ?"

తను హాలీగా, వరదాగా చేసే పనులు కూడా కృష్ణుడికి అప్పజెప్పి కుర్చీలో కూర్చుని కర్రపెత్తనం చేస్తారాయన.

పెరట్లో తులసి కోట దగ్గర మందార మొక్కను నాటాడు ఓ రోజు.

ఎందుకురా, కృష్ణా, అది? అంటే—

"పూజకు పువ్వులు వేరేగా మీకు దగ్గరగా ఉండాలమ్మగారూ" అని జవాబిచ్చాడు.

వాడి కళ్లలో ఎంత చురుకుదనం! వాడు తినే దానికంటే ఎక్కువ బలమైన, పుష్టికరమైన ఆహారం తింటున్నా రామిగాడిలోనూ, మిగతా పిల్లలలోనూ అటువంటి చురుకుదనం కనిపించదేం?

అందరి దృష్టిలోనూ కృష్ణుడొక గాలిమొక్క. డబ్బిస్తున్నాం కాబట్టి వాడే పనైనా చెయ్యాలని వాళ్ళ ఉద్దేశం.

తన దృష్టిలో మాత్రం కృష్ణుడు ముళ్లపొదల మధ్య తులసిమొక్క.

మళ్లీ— కృష్ణుడికి మాత్రం అంతా సమానమే. అదే వాడిలోని గొప్ప గుణం.

చూస్తూండగానే కృష్ణుడు పొడుగెదిగాడు. ఇక పొట్టిలాగు వేసుకుంటే బాగుండదని తనే పట్టు బట్టి వాడి కో పొడుగు లాగూ, మంచి చొక్కా కుట్టించింది. ఎంత చవక బట్టల్లోనైనా ఎంతో బాగుండేవాడు.

వందలు పోసి కొన్నా, మిగతా పిల్లల బట్టల్లో ఏదో వెలితి కనిపించేది. ఎవరి ఇష్టప్రకారం వారు తప్పితే ఆమె ఇష్టాని కెప్పుడూ విలువ లేకపోయింది. పెద్ద వాళ్లయ్యాక మరీను.

కృష్ణుడు వెళ్లిపోయి ఆరేళ్లవుతూంది.

ఈ ఆరేళ్లలోనూ చెప్పుకో దగ్గ మార్పు లేమీ జరగలేదు. డిగ్రీ చేత బట్టుకుని కాళ్లరిగేట్టు తిరిగినా వాసుకు ఉద్యోగం లేదు. ఎంతో మంది వచ్చి చూసినా వసంతకు పెళ్లి కుదరలేదు— పిల్ల నచ్చితే కట్నం నచ్చలేదనీ, కట్నం నచ్చితే చదువు నచ్చలేదనీ. రామిగాడింకా చదువు వెంగబెడుతూనే ఉన్నాడు— వాడెంత ఉద్ధరిస్తాడో?

ఆయన సరేసరి! పిల్లల్ని ఓ మార్గంలో పెట్టలేక పోయామనే విచారం ఇప్పుడిప్పుడు కలుగుతూంది!

త నెప్పుడూ ఒక్కలాగే ఉంది.

వాసుకు ఉద్యోగం, వసంతకు పెళ్లి— ఈ రెండూ అయితే ఇక ఫర్వాలేదు. కుటుంబం ఓ దారిన పడ్డట్టే.

ఆయన రిటైరైన దగ్గర్నించీ కానీ సంపాదన లేదు. గవర్నమెంటు ధర్మమా అని నిలవేసుకున్నదంతా మొత్తంగా ముట్టింది.

అదంతా కరిగిపోకముందే ఈ రెండూ జరగాలి!

చర్చి బెల్లు ఏడు కొట్టింది.

కృష్ణుడి కోసం తన కళ్లు ఎదురు చూస్తూనే ఉన్నాయి.

తను వస్తున్నట్టు ఉత్తరం వ్రాశాడు కృష్ణుడు. ఏ వేళకన్నా రాకపోతాడా అన్న ధైర్యం ఉంది.

పాత స్నేహితు డెవరో వచ్చాడని చెప్పి వెళ్లారాయన. వాసు సరేసరి—ఏమున్నా, లేకపోయినా క్లబ్బు వదలడు. ఏం చేస్తాడు అక్కడంత సేపు?

కృష్ణుడు వస్తున్నాడని చెప్పినా, ఫ్రెండ్సుతో వసంత సినిమాకీ, రామిగాడు బీచికీ—ఎవరి దారిని వారు వెళ్లిపోయారు.

తనకు తప్పితే ఎవ్వరికీ కృష్ణుడి పట్ల ఏ విధమైన అభిమానమూ లేదు. ఎలా ఉంటుంది? వాడిచేత పనులు మాత్రం చేయించుకున్నారు. అయినా, పిల్లకు కావలిసింది మనసున్న మనుషులు కారు. నాగరికతతో మిలమిల మెరిసే స్నేహితులు కావాలి ఎంత సేపూ.

కృష్ణుడు వస్తే ఏమనుకుంటాడు?

అందరి పనీ ఒక్కడూ బొంగరంలా తిరుగుతూ చేసేవాడు. ఉత్తరంలోకూడా పేరు పేరునా అందర్నీ అడుగుతూ వ్రాశాడు. వాడికున్న బుద్ధిలో వెయ్యో వంతు వీళ్లకు లేదు. ఉన్నట్లయితే ఎవరైనా వాడి కోసం ఉండేవారే.

ఏడేళ్ల పాటు కృష్ణుడు తనతో ఉండి తన కుటుంబంలో కలిసిపోయాడు. కుటుంబంలో ఒకడుగా కష్టాలు పంచుకున్నాడు. ఏ కొద్దిపాటి సుఖాన్నో అనుభవించి ఉంటాడు. అప్పట్లో వాడి ఒక్కగా నొక్క దిక్కూ అయిన వాళ్ల నాన్న పోకపోతే— కృష్ణుడు తన దగ్గరే ఉండేవాడేమో? తనకీ కాలక్షేపం.

తండ్రి పోయి మూణ్నెల్లు తిరగలేదు. ఓ రోజు ఉన్నట్టుండి కృష్ణుడు మాయమయ్యాడు.

"పసిగుడ్డును చేరదీశాం. రెక్కలొచ్చాయి. వెళ్లిపోయాడు. అయినా, ఇక్కడిలా వాడి కెక్కడా జరగదు. నాలుగు రోజుల్లో తిండికి లేక తిరిగి రాడూ?"

ఆయన అభిప్రాయంతో తను ఏకీభవించలేకపోయింది.

"నగానట్రా చూడండే. లంకించుకు మరీ పోయి ఉంటాడు."

వాసు తన మనసులో ఉన్నది బయట పెట్టాడు.

ఎవ్వరేమనుకున్నా తనకి మాత్రం కృష్ణుడి మీద ఏ విధమైన అనుమానమూ కలగలేదు.

కులానికీ, వయసుకూ చిన్నగానీ, కృష్ణుడిలో అటువంటి గుణాలు లేవు. బలమైన కారణముంటేనే గాని వాడే పనీ ధైర్యం చేసి చెయ్యడు.

ఆర్నెల్లు గడిచిపోయాయి. ప్రతి పనిలోనూ కృష్ణుడు లేని లోటు తెలియ వచ్చింది. ఎవరెంత చెప్పినా మరోమనిషిని పెట్టుకోవడానికి తన మనసొప్పలేదు. పిల్లలు మరీ సోమరులై పోవడం తన కిష్టం లేదు.

ఓ రోజు తన పేర ఉత్తరమొస్తే అంతా ఆశ్చర్యం వ్యక్తపరిచారు.

అది కృష్ణుడు వ్రాసింది. ఏదో చిన్న పని చేసుకుంటూ చదువుకుంటున్నాడట. ఎంత సంబర పడిందో తను! ఒకరు తీర్చకపోయినా, తన కోరికను తనే తీర్చుకుంటున్నాడు. ఎక్కడున్నా జీవితంలో వాడు సుఖపడ్డమే కావాలి తనకు.

"మీకు చెప్పివెళ్లనందుకుక్షమించాలి."

కుర్రనాగన్న! చెబితే తను వెళ్లనిచ్చేదా?

తిన్నవి నాలుగు మెతుకులే అయినా, కొండంత అభిమానాన్ని పెంచుకున్నాడు తనపై. అప్రయత్నంగా కళ్లు తడిశాయి.

"అమ్మా! అన్నం పెట్టవూ?"

రామిగాడు షికారునుంచి వచ్చాడు.

ఆలోచనలలోంచి తేరుకుని మళ్లీ తన పనిలో మునిగిపోయింది.

అర్ధరాత్రి. సన్నజాజి పందిరిమీద చప్పుడైతే చటుక్కున లేచి చూసింది.

ప్రకృతంతా నిర్మలత్వాన్ని పొందుపరచుకుని అమాయకంగా ఉంది.

ఎక్కడో రైలుకూత!




మృగరాజు

ఫోటో— ఓ. ఎమ్. వరప్రసాదరావు (గుంటూరు)

77

# మార్గదర్శులు



## ఈశాన్య దిశగా పసిఫిక్ తీరానికి ప్రయాణం







ఈశాన్య దిశగా పసిఫిక్ మహాసముద్ర తీరం చేరుకొన్న మొదటి యాత్రికుల వర్గానికి అలెగ్జాండర్ మెకెంజీ నాయకత్వం వహించాడు. అతడు చర్మాల వ్యాపారస్థుడు. ఉత్తర ఆల్బెర్టాలోని అథబాస్కా సరస్సు తీరాన వాణిజ్య స్థావరం ఏర్పరుచుకొని ఉన్నవాడు.

మెక్సికోకు ఉత్తరాన భూభాగం మీదుగా పసిఫిక్ తీరానికి అంతకుముందు ఎవ్వరూ ఎరగని మార్గం కనుగొనాలని అతడు సంకల్పించాడు.

1792 లో కొలదిమంది కెనేడియనులు, రెడ్ ఇండియనులతో కలిసి పీస్ నదికి ఎగువగా పయనం ప్రారంభించాడు మెకెంజీ. ఆ నది పశ్చిమం నుంచి అథబాస్కా సరస్సులోకి ప్రవహిస్తుంది. మెకెంజీ చలి కాలంలో ఆ నది ఒడ్డున మకాం చేసి, వసంత ఋతువులో తిరిగి ప్రయాణం ప్రారంభించాడు. ఆ నది పర్వతాలలో చాలా లోతైన లోయలో ప్రవహిస్తుంది. దానిని తరించడం అసాధ్యం. కనక మెకెంజీ వర్గంవారు పడవను మోసుకొని, అడవులలో దారి చేసుకొంటూ యాత్ర సాగించారు.

తరవాత రాకీ పర్వతాలను అధిరోహించవలసి వచ్చింది. అందుచేత నదిని విడిచి కొండ కనుమలో ముందుకు సాగారు. స్నేహభావం చూపిన ఇండియనుల సహాయంతో వారు దారి చూపగా మరొక నది చేరుకొని, సురక్షితంగా పసిఫిక్ చేరుకొన్నారు మెకెంజీ వర్గం. ఆ ప్రదేశం వాన్‌కూవర్ ద్వీపానికి అనతి దూరంలో ఉన్నది.

మెకెంజీ ప్రభృతులు తిరిగి అదే మార్గాన సురక్షితంగా స్వస్థలం చేరుకొన్నారు.

---

'కృష్ణ డెందుకు రాలేదు చెప్మా?'

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. సముద్రంమీంచి వచ్చే చల్లగాలికి పూల మొక్కలన్నీ తోగుతూ ఊగుతున్నాయి.

ఓ నిట్టూర్పు విడిచి పక్కమీద పడుకుని ఆకాశం వంక చూసింది. నక్షత్రాలు మెరుస్తున్నాయి.

తెగితెగని ఆలోచనల్లోనే ఎప్పుడో మాగన్ను పట్టింది.

• • •

"అమ్మా! ఓ సారి ఇలా రా."

వసంత పిలుపుకి పూజ గదిలోకి వెళుతున్నదల్లా హాల్లోకి తొంగి చూసింది.

గుమ్మంలో ఆరడుగుల నిండు విగ్రహం. ఖరీదైన బట్టల్లో అందంగా, అమాయకత్వం నిండిన ముఖంతో—కృష్ణుడు!

"కృష్ణా—నువ్వే! ఎంతవాడ వయ్యావురా!"

సంతోషంతో కళ్ళు చెమర్చాయి.

"నేనే, అమ్మగారూ, మరిచి పోయారా?"

కృష్ణుడు కాళ్ళమీద పడ్డాడు.

ప్రేమగా తల నిమరబోయింది. కృష్ణుడు మరీ పెద్దవాడయ్యాడు.

"మెట్రిక్ పాసయ్యాక నేవీలో చేరాను, బాబుగారూ! అంతా కలిసి నాలు గొంద లొస్తుంది."

వంటింట్లో కాఫీలు కలుపుతూ వింది తను. సంతోషంతో ఉక్కిరి బిక్కిరయింది.

పట్టుదల, పరిశ్రమ కృష్ణుడిని ఉన్నత స్థాయిలోకి తీసుకు వచ్చాయి.

కృష్ణుడు వీళ్లంతా అనుకునే గాలి మొక్క కాదు.

ఆ సంతోషం చాలు తనకి.

పెద్ద శబ్దమైతే ఉలిక్కి పడి లేచింది.

ఏదో లారీ రోడ్డంట వేగంగా పోతూంది.

అంతా ఎవరి నిద్రలో వారు ఉన్నారు. నోరార్చుకు పోతూంది. లేచేందుకు కాలు కదలటం లేదు. తొలి కోడి కూయటానికి ఇంకా రెండు గంటలు పైమున్నట్టుంది.

'ఇలా తన శరీరం తన వశం కాకపోవడం ఎప్పుడూ లేదు. తలంతా బాధతో బరువెక్కినట్లుంది.

ఎక్కడనించి జొరబడిందో తనలోకి వారం రోజులు లంఖణం చేస్తే వచ్చే నీరసం.'

దాహంతో నాలిక పిడచ గట్టుకు పోతూంది. దప్పిక తీరలేదు. మళ్లీ నిద్ర ముంచుకొచ్చింది.

• • •

ఆ మర్నాడు—

ఎప్పటిలా సూర్యుడు ప్రకాశించటం లేదు. మేఘాల మేలిముసుగుల్లో ఆకాశం దుఃఖిస్తుంది. ఆరారాకొట్టే జల్లులు. మధ్యలో ఎక్కడో తెరిపి.

ఆ ఇంటిముందు జనం మూగారు. చిన్నా పెద్దా వింతగా చూస్తున్నారు. ఆ ఇంటి ఇల్లాలు చచ్చిపోయింది.

భర్తా, పిల్లలూ దుఃఖసముద్రంలో మునిగిపోయారు. పోగయిన జనంలో గుసగుసలు—

"మహాతల్లి— చీకట్లు లేస్తే మళ్లీ ఏ అర్ధ రాత్రికో కళ్ళు మూసేది. ఇంటిపనీ ఒక్కతే చేసుకునేది. పిల్లలు దురదృష్టవంతులు."

"మాలక్ష్మి చావే చెప్పాలి. రాతిరంతా సుఖంగా నిద్రపోయి తెల్లారగట్ల పేణ మొగ్గేసింది. ఎవులో కిష్టడట. ఎప్పుడో పని జేశాట్ట. అన్నీ తలుచుకుంటూ పోనాదట. ముగ్గురు పిల్లలు కంటి ముందుండగా, ఆయమ్మ కోరిక్కే చెప్పాలి. . ."

అంతే. గేటు దాటి లోనికి అడుగు పెడుతూన్న వ్యక్తి ఆగిపోయాడు.

అతను కృష్ణుడు!! ✳